సాక్షి నారాయణపేట

బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025



సల్లంగా చూడమ్మ..

జములమ్మ తల్లి.. సల్లంగా చూడమ్మ అంటూ భక్తులు వేడుకున్నారు.

వివరాలు 8లో ▸



బీసీ కులగణన రీ సర్వే

బీసీ కులగణన రీ సర్వేను పకడ్బందీగా జరపాలని సంగెం సూర్యారావు అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.8 /14.5

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం కనిపిస్తుంది. రాత్రివేళ చల్లని గాలులు వీస్తాయి.

ఆదిలోనే అవాంతరాలు..!

పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ సర్వేకు అడ్డంకులు

- జిల్లాలో వేధిస్తున్న సర్వేయర్ల కొరత
- మరోవైపు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత
- 15 రోజుల్లో సర్వే కష్టమేనంటున్న అధికారులు



ఊట్కూర్ మండలంలోని బాపూర్‌లో భూ సర్వే చేస్తున్న సర్వేయర్ల బృందం

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నారాయణపేట –కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ ప్రక్రియకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఓవైపు భూములు కోల్పోతున్న రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండగా.. మరోవైపు సర్వేయర్ల కొరత వేధిస్తోంది. ఫలితంగా భూ సర్వే ప్రక్రియ సాఫీగా సాగక ఇరిగేషన్ అధికారులు, సర్వేయర్లు తలలు పట్టుకుంటున్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు ల్యాండ్ అకేషన్ ఆఫీసర్, ఆర్డీఓ రాంచందర్ నాయక్ పర్యవేక్షణలో ఈ నెల 15 నుంచి భూసేకరణ సర్వే కొనసాగుతోంది. అయితే పక్షం రోజుల్లో సర్వేను పూర్తిచేయాలని అధికారులు సర్వేయర్ల బృందంపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్న 9మంది సర్వేయర్లతో 15 రోజుల్లో సర్వేను పూర్తి చేయడం కష్టతరమని వారు బహిరంగంగా చెబుతున్నారు. పక్కా జిల్లాల నుంచి మరి కొంత మంది సర్వేయర్లను కేటాయిస్తే నిర్ణీత గడువులోగా సర్వే చేసేందుకు వీలవుతుందని ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సర్వేయర్ల కొరతను తీర్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పినట్లు సర్వేయర్లు చెబుతున్నారు.

373.18 ఎకరాల సర్వే..

నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం స్టేజ్–1 భూత్పూర్ నుంచి ఊట్కూర్ ట్యాంక్, స్టేజ్–2 ఊట్కూర్ ట్యాంక్ నుంచి జయమ్మ ట్యాంక్ వరకు, స్టేజ్–3 జయమ్మ ట్యాంక్ నుంచి కానుకుర్తి ట్యాంక్ వరకు చేపట్టనున్నారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులతో కలిసి సంయుక్తంగా సర్వే చేయాలని ల్యాండ్ అకేషన్ ఆఫీసర్, ఆర్డీఓ రాంచందర్ నాయక్ సూచిస్తూ ఈ నెల 13న ప్రొసీడింగ్‌ను సర్వే ఏడీకి పంపించారు. మక్తల్ మండలంలోని కాట్రేవ్‌పల్లి నుంచి కానుకుర్తి వరకు దాదాపు 373.18 ఎకరాలకు సంబంధించి భూ సర్వే చేపట్టాలని ప్రొసీడింగ్‌లో పేర్కొన్నారు.

పొంతన లేని లెక్కలు..

వాస్తవానికి ఇరిగేషన్ అధికారులు డీజీపీఎస్ సర్వే నిమిత్తం మార్కింగ్ ఇస్తున్నారు. ఈ మేరకు సర్వేయర్లు జీపీఎస్ పరికరంతో కొలతలు చేస్తున్నారు. అయితే ఇరిగేషన్ శాఖ అధికారుల లెక్కలకు, సర్వేయర్ల లెక్కలకు పొంతన లేకుండా పోతోంది. అంతేకాకుండా ప్రస్తుతం ఉన్న సర్వేయర్లలో ఎవరికి సరిగా సబ్ డివిజన్ పని రాదని జిల్లా ఆధికారే అంటున్నారని ఇరిగేషన్ ఆధికారులు బాహాటంగా చర్చించుకుంటున్నారు. వాస్తవానికి జీపీఎస్‌తో సర్వే చేస్తే సుమారు 3 నుంచి 5 మీటర్ల వరకు తేడా వస్తుందని.. విషయాన్ని జిల్లా సర్వే అధికారులకు చెప్పినా పెడచెవిన పెడుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు పేర్కొంటున్నారు. కాగా, సర్వే చేయడానికి ఆర్డర్స్ ఇచ్చి 15 రోజులు గడిచినా కేవలం 180 ఎకరాల సర్వే మాత్రమే జరిగింది. ఇప్పటి వరకు సబ్ డివిజన్ రికార్డు సమర్పించలేదంటే సర్వేయర్ల బృందం పనితీరును అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా కలెక్టర్ సర్వే శాఖపై పూర్తిస్థాయి దృష్టి సారిస్తే తప్ప భూసేకరణలో ముందడుగు పడే అవకాశం కనిపించడం లేదు.

రైతులు సహకరించాలి..



నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకానికి కావాల్సిన భూమి సేకరణకు రైతులు సహకరించాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించడం జరుగుతుంది. భూసేకరణ ప్రక్రియ త్వరగా జరిగితే ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతాయి. ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందుతుంది.

– రాంచందర్‌నాయక్, ఆర్డీఓ, నారాయణపేట

మండలాల వారీగా భూ సర్వే ఇలా..

- మక్తల్ మండలంలోని కాట్రేవ్‌పల్లిలో 68.30 ఎకరాలు, ఎర్గాన్‌పల్లిలో 5.25, మంతన్‌గోడ్‌లో 10.30, టేకులపల్లిలో 2.11, కాచ్వార్‌లో 14.25 ఎకరాల సర్వే చేపట్టాలని నిర్ణయించారు.
- ఊట్కూర్ మండలంలోని వెడివెల్లిలో 24.09, పూలిమామిడిలో 1.02, పెద్దపొర్లలో 15.25, జీర్నల్లిలో 9.27, దంతన్‌పల్లిలో 58.02, బాపూర్‌లో 70.28, తిప్రాస్‌పల్లిలో 3.36 ఎకరాలు.
- నారాయణపేట మండలంలోని జాజాపూర్‌లో 9.33, సింగారంలో 10.17, కొరంపల్లిలో 11.20, పేరపళ్లలో 13.03 ఎకరాలు.
- దామరగిద్ద మండలం బాపన్‌పల్లిలో 11.33, దామరగిద్దలో 5.07, లింగారెడ్డిపల్లి లో 16.20, గడిమున్కన్‌పల్లిలో 10.05 ఎకరాల సర్వే చేపట్టాలని ప్రొసీడింగ్‌లో పేర్కొన్నారు.

పోలీసు బందోబస్తు నడుమ..




కాట్రేవ్‌పల్లిలో సర్వేను అడ్డుకుంటున్న రైతులను సముదాయిస్తున్న పోలీసులు

మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల్లో చేపట్టిన భూ సర్వేపై రైతులు అభ్యంతరాలు వ్యక్తంచేస్తూ అధికార బృందాన్ని అడ్డుకుంటున్నారు. ఊట్కూర్ మండలంలోని బాపూర్, దామరగిద్ద మండలంలోని వత్తుగుండ్ల తండా, మక్తల్ మండలం కాట్రేవ్‌పల్లి రైతులు భూ సర్వేపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసు బందోబస్తు నడుమ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. రైతులు భూ నష్టపరిహారం చెల్లింపు విషయంలో నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేను కలిసి విన్నవించాలని.. సర్వే పనులను అడ్డుకోవద్దంటూ పోలీసులు సూచిస్తున్నారు.

అన్నింటా.. అట్టడుగు

- అక్షరాస్యతలో రాష్ట్రంలోనే చివరన ఉమ్మడి పాలమూరు
- గద్వాల, పేటలో 50 శాతంలోపే..
- తలసరి ఆదాయంలోనూ అంతంత మాత్రమే
- మౌలిక సదుపాయాల కల్పనలో చివరి వరుసలోనే
- తెలంగాణ స్టాటిస్టిక్ రిపోర్టులో వెల్లడి


తలసరి ఆదాయంలో (ఏడాదికి రూ.)



అక్షరాస్యత శాతం




జనాభా సాంద్రతలో.. (ప్రతి చదరపు కిలోమీటర్‌కు)



స్త్రీ, పురుష నిష్పత్తి (ప్రతి వెయ్యి మంది పురుషులకు ఉన్న మహిళల సంఖ్య)




కూలీలు, సాగుదారులు



పశుసంపద (గొర్రెలు)

మహబూబ్‌నగర్	9,99,042
నాగర్‌కర్నూల్	9,67,926
వనపర్తి	9,76,832
జోగుళాంబ గద్వాల	5,75,220
నారాయణపేట	12,95,597

జీఎస్‌డీపీ (రూ.కోట్లలో)



సాక్షి, నాగర్‌కర్నూల్: ప్రజల జీవన ప్రమాణాల స్థాయిని సూచించే అక్షరాస్యత, తలసరి ఆదాయం, జీఎస్‌డీపీ, మౌలిక సదుపాయాల కల్పన ఇలా అన్నింట్లోనూ ఉమ్మడి పాలమూరు జిల్లాలు రాష్ట్రంలోనే అట్టడుగున కొనసాగుతున్నాయి. అక్షరాస్యత విషయంలో జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలు రాష్ట్రంలోనే వెనకబడే ఉన్నాయి. ఈ జిల్లాల్లో అక్షరాస్యత శాతం కనీసం 50 శాతం కూడా మించ లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన తెలంగాణ స్టేట్ స్టాటిస్టిక్ రిపోర్టులో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

- పాఠశాల విద్యార్థుల డ్రాపౌట్స్‌లోనూ గద్వాల జిల్లా రాష్ట్రంలోనే రెండోస్థానంలో నిలిచింది. ఈ జిల్లాలో 28.8 శాతం మంది విద్యార్థులు పాఠశాల దశలోనే చదువుకు దూరమవుతున్నారు. ఇక వనపర్తి జిల్లా 8.81 శాతం మంది డ్రాపౌట్స్‌తో కాస్త మెరుగ్గా ఉంది. విద్యార్థులకు, ఉపాధ్యాయుల నిష్పత్తిలోనూ గద్వాల, నారాయణపేట జిల్లాలు వెనకబడి ఉన్నాయి. ఉపాధ్యాయుల కొరతలో జోగుళాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉంది.
- తలసరి ఆదాయం విషయంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలు చివరి వరుసలో ఉన్నాయి. నారాయణపేట జిల్లా రూ.1,94,962 తో అట్టడుగున ఉండగా.. తర్వాతి వరుసలో జోగుళాంబ గద్వాల జిల్లా కొనసాగుతోంది. అభివృద్ధి పురోగతికి సూచీగా నిలిచే జీఎస్‌డీపీలోనూ నారాయణపేట జిల్లా చివరి నుంచి నాలుగో స్థానంలో ఉంది. ఈ విషయంలో మహబూబ్‌నగర్ జిల్లా కాస్త మెరుగ్గా మొదటి నుంచి పదో స్థానంలో కొనసాగుతోంది.

ఉపాధి, పరిశ్రమలు కరువు..

ఉమ్మడి జిల్లాలో ఉపాధి కల్పన, పరిశ్రమల ఏర్పాటు లేకపోవడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పన తదితర విషయాల్లోనూ వెనుకబాటు కనిపిస్తోంది. పరిశ్రమల ఏర్పాటు విషయంలో నారాయణపేట జిల్లా రాష్ట్రంలోనే చిట్టచివరి స్థానంలో ఉంది. ఈ జిల్లాలో కేవలం 18 పరిశ్రమలు మాత్రమే ఉండగా.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహబూబ్‌నగర్‌లో అత్యధికంగా 297 పరిశ్రమలు ఉన్నాయి.

పశుసంపదలో మేటి..

పశుసంపద విషయంలో రాష్ట్రంలోని మిగతా జిల్లాలతో పోల్చితే ఉమ్మడి పాలమూరు మేటిగా నిలిచింది. ముఖ్యంగా నారాయణపేట జిల్లా 12.95 లక్షల గొర్రెలతో రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉంది. కూలీల సంఖ్య విషయానికి వస్తే గద్వాల జిల్లా 92.2 శాతంతో రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండగా.. వనపర్తి జిల్లాలో 88.2 శాతం మంది కూలీలు ఉన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా 33.9 శాతం మంది సాగుదారులు ఉన్నట్టు నివేదికలో వెల్లడయింది. రాష్ట్రంలోని మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల తర్వాత నాగర్‌కర్నూల్‌లోనే అత్యధికంగా 21.4 శాతం ఎస్సీ జనాభా ఉంది. హైదరాబాద్, కరీంనగర్ తర్వాత జోగుళాంబ గద్వాల జిల్లాలో తక్కువగా 1.5 శాతం మంది మాత్రమే ఎస్టీలు ఉన్నారు. జాతీయ రహదారుల విస్తరణ విషయంలో నల్లగొండ మొదటిస్థానంలో ఉండగా.. నాగర్‌కర్నూల్ జిల్లా 252.83 కి.మీ., విస్తీర్ణంతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉంది.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్



అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేసేందుకు ఈ నెల 21న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వస్తున్నారని.. సీఎం పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రం సమీపంలోని మెడికల్ కళాశాలలో సీఎం పర్యటన ఏర్పాట్లపై ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 21న మధ్యాహ్నం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెలీకాప్టర్‌లో జిల్లా కేంద్రం సమీపంలోని సింగారం చౌరస్తాలో ఏర్పాటుచేసే హెలిప్యాడ్ వద్దకు చేరుకుని జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్‌ను ప్రారంభించడంతో పాటు జిల్లా మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం అప్పక్‌పల్లి వద్ద ఉన్న మెడికల్ కళాశాలలో వంద పడకల ఎంసీహెచ్ విభాగంతో పాటు నర్సింగ్ కళాశాల, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. కళాశాల వద్ద ఏర్పాటుచేసే పబ్లిక్ మీటింగ్‌లో సీఎం పాల్గొంటారని చెప్పారు. అక్కడి నుంచి తిరిగి సాయంత్రం హైదరాబాద్ బయలుదేరుతారని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు దగ్గరుండి పూర్తిచేయాలని సూచించారు. సింగారం నుంచి అప్పక్‌పల్లి వరకు రోడ్డుతో పాటు ఇరువైపులా స్థలాన్ని శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమాల్లో సీఎంతో పాటు పాల్గొనే వీవీఐపీలకు అన్ని వసతులను సమకూర్చాలని.. మధ్యాహ్న భోజనం మెడికల్ కళాశాలలోనే ఏర్పాటు చేయాలన్నారు. అధికారులకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. పబ్లిక్ మీటింగ్‌కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ.. పోలీసు శాఖపరంగా ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తామన్నారు. అంతకుముందు సింగారం చౌరస్తాలో సీఎం ప్రారంభించే పెట్రోల్ బంక్, జిల్లా మహిళా సమాఖ్య భవన నిర్మాణ స్థలం, హెలిప్యాడ్ స్థలాన్ని కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. సమావేశంలో ఆర్డీఓ రాంచందర్ నాయక్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.రాంకిషన్, టీజీఎంఐడీసీ ఈఈ సురేందర్‌రెడ్డి, ఎస్ఈ జైపాల్‌రెడ్డి, ఆర్డీఓ మేఘాగాంధీ, డీఎస్పీ లింగయ్య తదితరులు ఉన్నారు.

- సీఎం పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికారెడ్డి పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. సింగారం చౌరస్తా, మెడికల్ కళాశాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. అనంతరం పోలీసు అధికారులతో కలిసి బహిరంగ సభ స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు.



బాధిత మహిళలకు 'భరోసా'

జిల్లా పోలీసు శాఖ భరోసా కేంద్రాల ద్వారా బాధిత మహిళలు, బాలికలకు అండగా నిలవడం అభినందనీయమని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గాయత్రి నగర్ కాలనీలో భరోసా కేంద్రం వార్షికోత్సవానికి కలెక్టర్‌తో పాటు ఎస్పీ యోగేష్ గౌతమ్ హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా భరోసా కేంద్రం పనితీరును నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. ఏడాది కాలంలో 71 కేసులు నమోదయ్యాయని.. అందులో పోక్సో గ్రేవ్ 51, నాన్ గ్రేవ్ 9, అత్యాచార కేసులు 11 ఉన్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని బాధిత మహిళలు, బాలికలకు భరోసా కేంద్రం నిర్వాహకులు అండగా ఉంటూ.. వారికి నిరంతరం రక్షణ కల్పించాలన్నారు. బాధితులకు న్యాయపరమైన సూచనలు, కౌన్సెలింగ్ చేయాలని సూచించారు. అదే విధంగా బాధితులకు నైపుణ్యాలను నేర్పించి.. సమాజంలో ఉన్నతంగా జీవించేలా దోహద పడాలన్నారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ.. భరోసా కేంద్రం ద్వారా బాధిత మహిళలు, బాలికలకు న్యాయం జరిగేలా చూస్తున్నట్లు చెప్పారు. బాధితులకు సురక్షిత వాతావరణంలో చేయూత అందించేందుకు భరోసా సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. హింస, లైంగిక వేధింపులకు గురైన బాలికలు, మహిళలు మరల అటువంటి వాటి బారిన పడకుండా చూడటమే భరోసా సెంటర్ లక్ష్యమన్నారు. బాధితులకు అన్నివిధాలా అండగా నిలుస్తున్న భరోసా కేంద్రం సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎన్.లింగయ్య, సీఐలు శివశంకర్, రాంలాల్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, భరోసా కేంద్రం ఇన్‌చార్జి ఎస్ఐ సునీత, కోఆర్డినేటర్ ప్రమీల, దేవి, చైల్డ్‌లైన్ నర్సింహులు, సఖి సెంటర్ రమాదేవి, కవిత, సీడబ్ల్యూసీ నుంచి కమల, నరేష్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రైతులకు అండగా ఉంటా



మక్తల్: నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వపరంగా అండగా ఉంటామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మండలంలోని కాట్రేవ్‌పల్లి, యర్నాగన్‌పల్లి శివారులో అధికారులు చేపట్టిన భూ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి భూమి పోయిన ప్రతి రైతుకు న్యాయమైన పరిహారం ఇప్పిస్తానని అన్నారు. బీడు భూములకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అందులో భాగంగా రూ.కోట్లు వెచ్చించి నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నట్లు చెప్పారు. భూ సర్వేకు రైతులందరూ సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, ఆనంద్‌గౌడ్, గణేశ్ కుమార్ తదితరులు ఉన్నారు.

అలసందలు క్వింటాల్ రూ.6,671

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం అలసందలు క్వింటాల్ గరిష్టంగా రూ. 6,671, కనిష్టంగా రూ. 6,529 ధర పలికింది. వేరుశనగ గరిష్టంగా రూ. 6,609, కనిష్టంగా రూ.4,330, ఎర్ర కందులు గరిష్టంగా రూ. 7,615, కనిష్టంగా రూ. 4,050, తెల్లకందులు గరిష్టంగా రూ. 7,670, కనిష్టంగా రూ. 6,432 ధరలు వచ్చాయి.

కేజీబీవీ జీసీడీఓపై వేటు

- విధుల నుంచి తొలగిస్తూ మహబూబ్‌నగర్ డీఈఓ ఉత్తర్వులు
- రిపోర్టు అనుకూలంగా ఇవ్వనందుకే తొలగించారని ఆరోపణలు



జీసీడీఓ తొలగింపుపై డీఈఓతో చర్చిస్తున్న యూజీఎఫ్ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) జీసీడీఓ(గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)పై వేటు పడింది. విధుల నుంచి తొలగిస్తూ డీఈఓ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఓ పాఠశాలలో విచారణకు సంబంధించి అనుకూలంగా రిపోర్టు ఇవ్వనందుకే జీసీడీఓను తొలగించారని పలు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవల రాజాపూర్ కేజీబీవీలో ఎస్‌ఓ విద్యార్థినులకు సరిగా గుడ్లు, అరటి పండ్లు ఇవ్వడం లేదని, విద్యార్థినులను పాఠశాలలో చేర్చుకునే విషయంలో డబ్బులు వసూలు చేస్తున్నారని, ఉపాధ్యాయులు రెండు గ్రూపులుగా విడిపోయి విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. దీంతో విద్యార్థినులు, తల్లిదండ్రులు జీబీవీ వద్ద నిరసన తెలిపారు. ఈ క్రమంలో డీఈఓ విచారణకు ఆదేశించారు. రాజాపూర్ ఎంఈఓ, కేజీబీవీ జీసీడీఓ రాధ సైతం విచారణకు వెళ్లి రిపోర్టును సమర్పించారు. ఈ క్రమంలో విచారణ పూర్తయ్యాక బాధ్యులపై చర్యలు తీసుకుంటారని అనుకున్న క్రమంలో కేజీబీవీ జీసీడీఓ రాధను విధుల నుంచి తొలగిస్తున్నట్లు డీఈఓ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. విద్యాశాఖ అధికారుల తీరుపై యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేష్‌తో పాటు పలువురు సంఘం నాయకులు డీఈఓను కలిశారు. వారు మాట్లాడుతూ ఇలాంటి పరిణామాలు బాధాకరమని, సంబంధం లేకుండా ఒక అధికారిణి తొలగించడం సరికాదని విమర్శించారు. ఎవరికి మేలు చేసేందుకు తొలగించారని, గతంలో అక్రమాలకు పాల్పడుతున్న వారిని తీసుకువచ్చేందుకు అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారా అని ప్రశ్నించారు. జీసీడీఓగా నియమించేందుకు అర్హత లేకుంటే మొదట విధుల్లోకి తీసుకోకుండా ఉండాల్సిందని, ఇప్పుడు అర్థాంతరంగా తొలగిస్తే సంబంధిత అధికారిపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందని, ఈ అంశాన్ని పరిశీలించాలన్నారు. తమకు అనుకూలంగా రిపోర్టు రాయనందుకే కొందరు కుట్రలు పన్ని జీసీడీఓ తొలగించారని పలువురు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

ఏసీబీకి చిక్కిన మక్తల్ సీఐ

- మరో ఇద్దరు కానిస్టేబుళ్లు సైతం
- ఓ కేసు విషయంలో రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



ఏసీబీకి పట్టుబడిన మక్తల్ సీఐ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు నర్సింహ, శివారెడ్డి

మక్తల్: ఓ కేసు విషయంలో వ్యక్తి నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటున్న సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రానికి చెందిన సందె వెంకట్రాములు మక్తల్‌లో శ్రీనిధి అనే సొసైటీని ఏర్పాటు చేసి.. ప్రజల నుంచి ప్రతినెలా కిస్తుల ప్రకారం డబ్బులు కట్టిస్తున్నారు. అయితే సొసైటీలో కొందరు వ్యక్తులతో బేధాభిప్రాయాలు రావడంతో మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఒకరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సందె వెంకట్రాములుపై కేసు నమోదు చేశారు. అయితే సందె వెంకట్రాములు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ వేయగా.. ప్రతి సోమవారం మక్తల్ పోలీస్‌స్టేషన్‌కు రావాలని షరతులతో కూడిన ముందస్తు బెయిల్ వచ్చింది.

ఆఫీసు, ఇళ్లలో సోదాలు..

కేసుకు సంబంధించిన చార్జీషీటు కోర్టులో దాఖలు చేయాల్సిన విషయంలో నిందితుడికి అనుకూలంగా వ్యవహరించేందుకు గాను మక్తల్ సీఐ జి.చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు నర్సింహ, శివారెడ్డి రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో సందె వెంకట్రాములు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా ముందస్తుగా ప్రణాళిక ప్రకారం మంగళవారం మక్తల్ పోలీస్ కార్యాలయంలో నిందితుడి నుంచి కానిస్టేబుల్ నర్సింహ రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇందులో ప్రమేయం ఉన్న మక్తల్ సీఐ చంద్రశేఖర్, కానిస్టేబుల్ శివారెడ్డిని సైతం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సీఐ కార్యాలయం, కానిస్టేబుళ్ల ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ మేరకు సీఐ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు నర్సింహ, శివారెడ్డిలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడుల్లో ఏసీబీ అధికారులు లింగస్వామి, జిలాని సయ్యద్, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళ బలవన్మరణం

బల్మూర్: మండల కేంద్రంలో మంగళవారం పురుగుమందు తాగి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బొప్పెల్లి సాలమ్మ (50) సోమవారం రాత్రి ఇంట్లో పురుగుమందు తాగింది. గుర్తించిన ఇరుగు పొరుగు వారు వెంటనే చికిత్స నిమిత్తం అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రమాదేవి తెలిపారు.

ఉరేసుకొని వృద్ధురాలు..

వనపర్తి రూరల్: పట్టణంలోని పీర్లగుట్టకు చెందిన ఓ వృద్ధురాలు ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాలు.. పీర్ల గుట్టకు చెందిన పల్ల సుబ్బమ్మ (58) పదేళ్ల నుంచి క్యాన్సర్‌తో బాధపడుతుంది. ఇటీవలే ఆమె ఊపిరితిత్తులు కూడా పాడైపోయాయి. మానసికంగా కృంగిపోయి జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంటి కిటికీకి చీరతో ఉరేసుకొంది. ఉదయం కుమారుడు వచ్చి చూడగా కిటికీకి వేలాడుతూ కనిపించింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు వెంకటేష్ మంగళవారం పోలీసులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హత్య చేయాలనే కుట్రలో వ్యక్తి రిమాండ్

మహబూబ్‌నగర్ క్రైం: కుటుంబ కలహాల కారణంగా పథకం ప్రకారం కిరాణ దుకాణంలో ఉన్న వ్యక్తిని హత్య చేయాలనే ఉద్దేశంతో పెట్రోల్ పోసి తగలపెట్టి పారిపోయిన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని హబీబ్‌నగర్‌కు చెందిన అబ్దుల్ సమ్మద్, రామయ్యబౌళికి చెందిన షేక్ ఖలీద్ ఇద్దరూ బంధువులు. కొన్ని రోజుల నుంచి రెండు కుటుంబాల మధ్య కుటుంబ కలహాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో జనవరి 8న రాత్రి అబ్దుల్ సమ్మద్ కిరాణ దుకాణంలో ఉన్న సమయంలో షేక్ ఖలీద్ తనను గుర్తు పట్టకుండా ముఖానికి మాస్క్‌తో అక్కడికి పెట్రోల్ డబ్బాతో వచ్చాడు. అబ్దుల్ సమ్మద్‌తో పాటు దుకాణంపై ఆ పెట్రోల్ పోసి నిప్పు అంటించి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు..షేక్ ఖలీద్‌ను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అతన్ని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌లో భాగంగా జిల్లా జైలుకు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం

కొత్తకోట రూరల్: ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు పానుగంటి అలివేల, పెద్ద నాగయ్య కుమార్తె మరియను పదేళ్ల క్రితం వనపర్తి మండలంలోని అంజనగిరికి చెందిన రామకృష్ణకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి చందు(8), మణి (6) ఇద్దరు కుమారులు ఉన్నారు. రామకృష్ణ మూడు నెలల క్రితం మృతి చెందాడు. మరియ పిల్లలతో కలిసి తల్లి అలివేల వద్ద పామిరెడ్డిపల్లిలో ఉంటుంది. ఈనెల 13న మరియ ఇంటి నుంచి పిల్లలతో కలిసి వెళ్లిపోయింది. చుట్టుపక్కల, బంధువుల దగ్గర వెతికినా సమాచారం లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళపై దాడి: కేసు నమోదు

పాన్‌గల్: మహిళపై రాయితో దాడిచేసి గాయపర్చిన ఘటనపై మంగళవారం కేసు నమోదైనట్లు హెచ్‌సీ ప్రసాద్ తెలిపారు. వివరాలు.. మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లికి చెందిన జంబులమ్మ మంగళవారం తన ఇంటి సమీపంలో కాలకృత్యాలు తీర్చుకొని తిరిగి వెళ్తున్న క్రమంలో ఇదే గ్రామానికి చెందిన సహదేవుడు రాయితో మహిళపై దాడిచేశాడు. దీంతో మహిళకు కుడికాలు, మోకాలు కింది భాగంలో బలమైన రక్తగాయమైంది. గతంలో ఇదేవ్యక్తి బాధిత మహిళ ఇంటి తలుపులు తోసిన ఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. ఘటనపై మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సహదేవుడుపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

పోలీస్ బందోబస్తు మధ్య సర్వే పనులు



యర్నాగన్‌పల్లి గ్రామ శివారులో సర్వే చేస్తున్న అధికారులు

మక్తల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ సర్వే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండలంలోని యార్నాగన్‌పల్లి శివారులో భూసర్వే పనులను రైతులు అడ్డుకుంటారని ఉద్దేశంతో పోలీసు బందోబస్తు మధ్య అధికారులు మంగళవారం సర్వే చేపట్టారు. మక్తల్ ఎస్‌ఐ భాగ్యలక్ష్మితో పాటు పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకొని రైతులు తమకు సహకరించాలని కోరారు. రైతులు అక్కడికి చేరుకొని తమను ఆదుకోవాలని వేడుకున్నారు.

హైటెక్ వ్యభిచారం !



వాట్సాప్ వేదికగా జోరుగా దందా
- నివాస గృహాలే అడ్డాలుగా..!
- జిల్లాకేంద్రంతో పాటు జాతీయ రహదారి వెంట

మహబూబ్‌నగర్ క్రైం: పాలమూరులో కొత్త ట్రెండ్ వ్యభిచారం కొనసాగుతోంది. ఇతర ప్రాంతాల నుంచి అందమైన అమ్మాయిలను తీసుకొచ్చి విటులను ఆకర్షిస్తున్నారు. ఈ వ్యవహారమంతా వాట్సాప్‌లో డీల్‌చేసి చివరి తంతు అద్దె ఇళ్లలో పూర్తి చేస్తున్నారు. పాలమూరుతో పాటు జాతీయ రహదారి వెంట ఉన్న జడ్చర్ల, భూత్పూర్‌లో ఈ దందా జోరుగా సాగుతున్నట్లు సమాచారం. కొన్నిచోట్ల పోలీసుల కన్నుసన్నల్లో.. మరికొన్ని చోట్ల గుట్టుచప్పుడు కాకుండా సాగిస్తున్నారు. కొందరు ఈ వృత్తిని జీవనోపాధి కోసం చేస్తుండగా.. మరికొందరిని డబ్బు ఆశజూపి ఈ రొంపులోకి దింపుతున్నారు.

ఎవరికి అనుమానం రాకుండా..

ఎవరికి అనుమానం రాకుండా నివాస గృహాలనే అడ్డాలుగా మార్చుకుంటున్నారు. జిల్లాకేంద్రంలో ఈ కేంద్రాలు అధికంగా ఉన్నట్లు సమాచారం. వాట్సాప్ వేదికగా ఈ వ్యాపారం నడిపిస్తూ సెల్‌ఫోన్‌లోనే బేరసారాలు కుదుర్చుకుంటున్నారు. కొందరు గృహిణులను సైతం ప్రలోభాలకు గురిచేసే ఈ రొంపిలోకి లాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. దీంతో పచ్చటి కుటుంబాలు నాశనమవుతున్నాయి.

హైవే వెంట..

పాలమూరు, జడ్చర్ల, భూత్పూర్‌తో పాటు జాతీయ రహదారి వెంట ఉన్న రాయికల్, అడ్డాకుల టోల్‌ప్లాజా సమీపం, కావేరమ్మపేట, దివిటిపల్లి వంతెనతో పాటు మరికొన్ని చోట్ల ఈ దందా బాగానే సాగుతున్నట్లు సమాచారం. ఆర్థికంగా వెనుకబడిన మహిళలు కొందరు ఉండగా.. విలాసవంతమైన జీవితం కోసం మరికొందరు వృత్తిలోకి దిగుతున్నారు. జిల్లాకేంద్రంలో రోజు పదులసంఖ్యలో ఇళ్లు, హోటళ్ల గదులతో పాటు చిన్న చిన్న లాడ్జీల్లో ఈ దందా కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

వాట్సాప్ వేదికగా..

ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఈ దందా నిర్వహణకు వినియోగిస్తున్నారు. తొలుత వాట్సాప్‌లో మహిళల ఫొటోలను విటులకు పంపడం.. వాటిని చూసి నచ్చితే డీల్‌కు సిద్ధమవుతున్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడే సమయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో..

జిల్లాకేంద్ర సమీపంలోని రాజీవ్ స్వగృహ, హౌజింగ్‌బోర్డు, శ్రీరామకాలని, బైపాస్, శ్రీనివాసాకాలని, వేంకటేశ్వరకాలని, హబీబ్‌నగర్, రాజీవ్ గృహకల్ప, అశోక్ టాకీస్ ఏరియా, పాత బస్టాండ్‌తో పాటు పలు కాలనీల్లోని ఇళ్లల్లో ఈ దందా కొనసాగుతున్నట్లు సమాచారం. చుట్టుపక్కల ఇళ్లవారికి అనుమానం రాకుండా బంధువులంటూ పరిచయం చేస్తున్నారు. చాలా వరకు సొంత ఇళ్లలోనే ఈ దందా నడిపిస్తుండగా కొందరు అద్దె ఇళ్లలో కొనసాగిస్తున్నారు.

యువతులను సైతం..

కొందరు మహిళలు యువతులను సైతం ఈ వ్యాపారంలోకి దించుతున్నారు. హైదరాబాద్‌తో పాటు పల్లెల నుంచి వచ్చే కొందరు యువతులకు డబ్బు ఆశజూపి ఈ రంగంలోకి దించి వారి జీవితాన్ని నాశనం చేస్తున్నారు. మధ్యవర్తులే విపరీతంగా సంపాదిస్తున్నారు. జిల్లాకేంద్రంలోని రూరల్, టూటౌన్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ వ్యభిచార కేంద్రాలు కొనసాగుతున్నాయి. పోలీసులకు సమాచారం ఉన్నా తేలిగ్గా తీసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

తనిఖీలు నిర్వహిస్తున్నాం..

పట్టణంలో వ్యభిచారం, గంజాయి, పేకాట స్థావరాలపై ప్రత్యేక నిఘా ఉంచాం. వ్యభిచారం జరుగుతుందని అనుమానం ఉన్న ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నాం. కేంద్రాలు కొనసాగుతున్నట్లు పోలీసులకు సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. ఇటీవల దివిటిపల్లి డబుల్ బెడ్‌రూం ప్రాంతంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించాం. వ్యభిచారం నిర్వహించే వారిపై కేసులు నమోదు చేస్తాం. – వెంకటేశ్వర్లు, డీఎస్పీ మహబూబ్‌నగర్

ముగ్గురు రోహింగ్యాల అరెస్టు, రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, వెనక రోహింగ్యాలు

వివరాలు వెల్లడించిన మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల టౌన్: దేశంలోకి అక్రమంగా చొరబడి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం రాజాపూర్ మండలం నర్సింగ్‌తండాలో అయూబ్ ఫాంహౌజ్‌లో పనిచేస్తున్న ముగ్గురు రోహింగ్యాలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం సాయంత్రం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. మయన్మార్ దేశానికి చెందిన నూర్ మహమ్మద్ 2012లో మయన్మార్ నుంచి భారత్‌లోకి అక్రమంగా చొరబడి బాలాపూర్‌లో నివసించేవారన్నారు. అక్కడి నుంచి బావమరిది ద్వారా నకిలీ పాస్‌పోర్టు, వీసా సృష్టించుకుని 2016లో సౌదీ అరేబియాకు వెళ్లి టైలరింగ్ పనులు చేస్తూ 2022లో తిరిగి భారత్‌కు వచ్చాడన్నారు. ఈ ఏడాది మళ్లీ దుబాయికి వీసా తీసుకుని నెలరోజుల పాటు వెళ్లి అక్టోబర్‌లో వచ్చి తిరిగి బాలాపూర్‌లో నివాసం ఉంటున్నారన్నారు. బాలాపూర్‌లోనే నివాసం ఉంటున్న రిజ్వానా అనే రోహింగ్యాను పెళ్లి చేసుకున్నాడని, తర్వాత ఏజెంట్ సహాయంతో త్రిపుర బార్డర్ ద్వారా బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజారుకు వెళ్లి ఏడాది పాటు నివాసం ఉన్నారన్నారు. ఇదే సమయంలో బంగ్లాదేశ్‌లోనే ఉన్న మహమ్మద్ అరోబ్ అహ్మద్, సుమయ దంపతులను భారత్‌లో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని ఆశచూపి వారి నుంచి డబ్బులు వసూలు చేశారన్నారు. డబ్బులు తీసుకున్న తర్వాత నూర్ మహమ్మద్ భార్య రిజ్వానాతో కలిసి అరోబ్ అహ్మద్, సుమయలను తీసుకుని ధర్మానగర్, త్రిపుర బార్డర్ ద్వారా రాత్రివేళ భారత్‌లోకి చొరబడి తెల్లవారే సరికి అగర్తలా చేరుకుని సికింద్రాబాద్‌కు రైలు ద్వారా వచ్చారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు చెందిన అయూబ్ ఫాంహౌజ్ నర్సింగ్‌తండాలో ఉండటంతో అక్కడ పనికి చేరారని తెలిపారు. నలుగురు ఫాంహౌజ్‌లోనే ఉంటూ పదిరోజుల క్రితం ఏజెంట్ ద్వారా నూర్ తన భార్య రిజ్వానాను బంగ్లాదేశ్‌కి పంపించినట్లు డీఎస్పీ వెల్లడించారు. నలుగురు రోహింగ్యాలు ఉన్నారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సీఐ నాగార్జునగౌడ్, రాజాపూర్ ఎస్‌ఐ శివానందగౌడ్ ఫాంహౌజ్‌కు వెళ్లి పరిశీలించగా ముగ్గురిని గుర్తించి మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు ముగ్గురిని అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చి రిమాండ్‌కు పంపిస్తామని స్పష్టం చేశారు. పరారీలో ఉన్న రిజ్వానాను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామన్నారు. కాగా రిజ్వానా ఫేక్ ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్‌ను చార్మినార్ వద్ద తీసుకున్నట్లు తెలుస్తుందని, అందుకు సహకరించిన వారిపై సైతం కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ పేర్కొన్నారు. భారత్‌లోకి చొరబడేందుకు, నకిలీ పాస్‌పోర్టు, వీసాలు సంపాదించేందుకు సహకరించిన వారిని సైతం విచారిస్తామన్నారు. స్థానికంగా ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. జిల్లాలో ఉన్న ఫాంహౌజ్‌లు, హోటళ్లు, అన్నింటిపైనా నిఘా ఉంచి అనుమానాస్పదంగా ఉండే వారిని అదుపులోకి తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

బీసీ కులగణన రీ సర్వే పకడ్బందీగా జరపాలి



సమావేశంలో సంఘీభావం తెలుపుకుంటున్న బీసీ సంఘాల నాయకులు

బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు సంగెం సూర్యారావు

స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీ కులగణన రీ సర్వేను పకడ్బందీగా జరపాలని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు సంగెం సూర్యారావు అన్నారు. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం సమాజ్ కార్యాలయంలో బీసీ కులగణన నివేదికపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 1931, 2025 సంవత్సరాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. గతంలో 1931 బ్రిటీష్ ప్రభుత్వం జరిగిన కులగణన, ఇప్పుడు మళ్లీ 2025లో చేసిన కులగణన చరిత్రలో నిలిచిపోయే సంవత్సరమని అన్నారు. ఈ సమగ్ర కులగణనలో బీసీలను తక్కువ చేసి చూపించడం, అగ్రవర్ణాలను ఎక్కువ చూసి చూపించడంలో అంతర్యమేమిటో బీసీ సమాజానికి సమాధానం చెప్పాలన్నారు. ఈడబ్ల్యూఎస్ కోటాను కాపాడుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న నాటకమని, ఇది ఎంతో కాలం నిలవదని, రేపు జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే విధంగా బీసీలకు వ్యతిరేకంగా ముందుకు వెళితే ప్రభుత్వాన్ని ఇంటికి పంపడం ఖాయమని అన్నారు. బిహార్ రాష్ట్రంలో కులగణన చేస్తే 26 సార్లు అక్కడి సీఎం సమీక్ష సమావేశాలు నిర్వహిస్తే మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక్క రోజు కూడా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన దాఖలాలు లేవన్నారు. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మనఓటు మనకే వేసుకుందాం అనే నినాదంతో ముందుకెళ్లి అత్యధికంగా బీసీలు గెలవాలని, జనరల్ స్థానాల్లో కూడా బీసీలు పోటీలో ఉండాలని కోరారు. సమావేశంలో బీసీ నాయకుడు బాబుగౌడ్, బీసీ సమాజ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, ఆయా బీసీ సంఘాల ప్రతినిధులు సతీష్‌యాదవ్, శ్రీనివాసులు, పాండురంగ యాదవ్, సారంగి లక్ష్మీకాంత్, బుగ్గన్న, అశ్విని సత్యం, వెంకటనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, దుర్గేష్, బి.శేఖర్, తాయప్ప, బీసీ నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు



నంచర్లగేట్‌లో ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ నరేందర్

సాక్షి ఎఫెక్ట్..

మహమ్మదాబాద్: రైతులను ఎవరైనా అనవసరమైన మందులు అంటగడుతూ ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి నరేందర్ అన్నారు. మంగళవారం 'సాక్షి'లో 'గుళికలు కొంటేనే యూరియా' శీర్షికన ప్రచురితమైన కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. ఈ మేరకు ఆయన మండలంలోని నంచర్లగేట్, మహమ్మదాబాద్ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి అమ్మకాలపై ఆరాతీశారు. అనుమతి లేకుండా అమ్ముతున్న ఎరువులు, పెస్టిసైడ్స్ దుకాణాల వివరాలను తెలుసుకున్నారు. నకిలీ ఎరువులు, గుళికలు, రసాయనాలు అమ్మితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నంచర్లగేట్‌లోని శ్రీలక్ష్మీనర్సింహ ఫర్టిలైజర్ దుకాణంలో నిబంధనలకు విరుద్ధంగా మందులు అమ్ముతున్నందున మెమో జారీ చేశారు.

రామన్‌పాడులో 1,020 అడుగులు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం 1,020 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా నీటి సరఫరా లేదని, ఎన్టీఆర్ కాల్వకు 31 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 155 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.

నిరంతర సాధనతోనే విజయం



ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులతో అసోసియేట్ డీన్, అధ్యాపక బృందం

కొత్తకోట రూరల్: నిరంతర సాధనతోనే విజయం సిద్ధిస్తుందని, ప్రణాళిక, పట్టుదల ఉంటే ఎంతటి విజయాన్ని అయినా సాధించవచ్చని మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య అన్నారు. మంగళవారం ఉద్యాన అధికారులుగా ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థుల సన్మాన కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. గతేడాది తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఉద్యాన అధికారుల ఎంపిక పరీక్షలో కళాశాలకు చెందిన పదిమంది పూర్వ విద్యార్థులు ఉత్తీర్ణులై వివిధ జిల్లాల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. మొత్తం 21 పోస్టుల్లో కళాశాలకు చెందిన పదిమంది ఉన్నారని.. ముగ్గురు ఉమ్మడి పాలమూరు జిల్లాలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారులుగా బాధ్యతలు చేపట్టిన మహేశ్, వినాయక రుద్ర, శివతేజ, వెంకటరమణను ఆయనతో పాటు అధ్యాపకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. షహనాజ్, డా. పూర్ణిమమిశ్రా, డా. శంకరస్వామి, డా. శ్రీనివాస్, నవ్య, శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు

కనులపండువగా తిక్కవీరేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవంలో వేల సంఖ్యలో పాల్గొన్న భక్తులు

- విద్యుత్ కాంతులతో ఆలయ ప్రాంగణం
- మొక్కులు తీర్చుకున్న భక్తులు
- అధిక సంఖ్యలో హాజరైన ప్రజలు



రథంపై తిక్కవీరేశ్వరస్వామి ఉత్సవ విగ్రహం

అయిజ: మండల కేంద్రంలో వెలసిన తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం అర్ధరాత్రి భక్తులు తిక్కవీరేశ్వరస్వామి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యుత్ కాంతులతో ఆలయం కొత్త శోభను సంతరించుకుంది. రథాన్ని పూలమాలలు, మావిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. రథంపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. బాణసంచా కాల్పులతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా కుంభం కాగుతెచ్చి రథం చుట్టూ పొలిచల్లి స్వామివారి రథాన్ని కదిలించారు. పెద్ద ఆంజనేయస్వామి ఆలయంవరకు భక్తులు రథం లాగారు. అడుగడుగునా మహిళలు హారతులు పట్టారు. రథోత్సవంలో యువత పలకల కోలాటం, కట్టెల కోలాటం ఆడారు. నందికోళ్ల సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెల్లవారుజామున రథంను యథాస్థానానికి చేర్చారు. రథోత్సవంకు తెలంగాణ, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సల్లంగా చూడమ్మ.. జములమ్మ



అలంకరణలో జములమ్మదేవి

గద్వాల న్యూటౌన్: నడిగడ్డ ప్రజల ఇంటి ఇలవేల్పుగా విరాజిల్లుతున్న జములమ్మ క్షేత్రం మంగళవారం భక్తజనసంద్రంగా మారింది. తెల్లవారుజామున 4.30 గంటల నుంచే అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లలో భక్తులు బారులుతీరారు. నడిగడ్డతోపాటు ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. అమ్మవారికి కోళ్లు, మేకపోతులు బలిచ్చి.. నైవేద్యాలు సమర్పించారు. సల్లంగా చూడమ్మ.. జములమ్మ తల్లి అంటూ భక్తిశ్రద్ధలతో వేడుకున్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పాలకవర్గ సభ్యులు, అధికారులు ఏర్పాట్లు చేశారు. డిస్ట్రిక్ ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి కుశ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి గంటా కవిత, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి, తీర్థ ప్రసాదాలు అందించారు.



క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

ఘనంగా ముగిసిన పద్యనాటక ప్రదర్శనలు



భక్తిగీతాలు ఆలపిస్తున్న సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో దేవాలయం ఆవరణలో నిర్వహిస్తున్న పౌరాణిక పద్య నాటక ప్రదర్శనలు మంగళవారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఉత్సవాల చివరి రోజు శ్రీరాజరాజేశ్వరి భజన మండలి (మహబూబ్‌నగర్), శ్రీరామాంజనేయ భజన మండలి (బొక్కలోనిపల్లి) బృందాలు భజనలు ఆలపించారు. పుట్టోజు చంద్రమౌళి బృందం అన్నమయ్య సంకీర్తనాలహరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమిత్ర కళానాట్య మండలి కార్యదర్శి వి.నారాయణ మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి మన్యంకొండ బ్రహ్మోత్సవాల సందర్భంగా నాటక ప్రదర్శనలు ఇస్తున్నట్లు తెలిపారు. పద్య నాటక ప్రదర్శనల విజయవంతానికి సహకరించిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, సూపరింటెండెంట్ నిత్యానందం, శ్రీమిత్ర కళా నాట్య మండలి ఉపాధ్యక్షులు ఎస్.నర్సింలుతోపాటు భాస్కరాచారి, రాంచంద్రయ్య, కురుమూర్తి, ఆంజనేయులు, మాసన్న, పాండురంగాచారి, నారాయణ, రాము తదితరులు తదితరులు పాల్గొన్నారు.